


# రైలు ప్రయాణము

పెమ్మరాజు భరతభూషన్

గడియారం నాలుగ్గంటలు కొట్టింది అప్పుడే రావుగారు నిద్రలేచారు. ఎదురింట్లో మునసబ్‌గారమ్మాయి సంగీత సాధన చేస్తోంది. క్రిందిభాగంలో రేడియోలో పాటలు వస్తున్నాయి వేణా దానికి తగ్గట్లు భరతనాట్యం చేస్తున్నాడు. రావుగారు సిగరెట్టు కాల్చుకుంటూ టేబిల్‌మీద పడివున్నకవరు తీసి చదవటంలో నిమగ్నులయ్యారు ఉత్తరం చదువుతున్నకొలది ఆయన మొహంలో రకరకాల భావాలు నాట్యం చేయసాగాయి ఉత్తరం పూర్తి చేయగానే ఆయన ముఖం ఆనందంతో విప్పారింది. ఇన్నాళ్లకు తన జన్మ సార్థకం అవబోతూవుంది తనకు తగిన అవకాశం లభించిందని తృప్తిగా ఊపిరిపీల్చుకున్నారు. భార్య కాంతమ్మగారు కాఫీతో ప్రవేశించి ఊహాలోకంలో విహరిస్తున్న రావుగార్ని పరిశీలిస్తూ వుండిపోయారు. ఆ వుత్తరం ఏమిటి, ఎక్కడనుండి వచ్చింది అన్నదే కాంతమ్మగారికెదురైన సమస్య.

'ఏమండీ' అని ఆవిడే పలుకరించారు నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ.

'ఆ' అన్నారు రావుగారు.

'కాఫీ తీసికోండి' అన్నది కాంతమ్మగారు రావుగారు కాఫీ తీసికుంటూ ఉత్తరం ఆమెకు చూపిస్తూ 'చూశావా! కాంతం. పట్నంనుండి పిలుపు వచ్చింది ఇన్నాళ్లకు నాకు తగిన అవకాశం లభించింది'

'ఆ' అన్నారు కాంతమ్మగారు ప్రత్యేకత ఏదిలేనట్లుగా.

'అదికాదు కాంతం.'

'ఇది మీకు మామూలేకదా'

నీవు అనుకున్నంత మామూలు సభకాదు ఇది కాంతం. ఆ సభలన్నీ ఒకఎత్తు ఇది ఒక్కటే ఒకఎత్తు. దేశవిదేశ ప్రతినిధుల మధ్య 'భారతీయ సంస్కృతి' అన్న అంశం మీద ఉపన్యసించడం అంటే మామూలు కాదు.

'ఆ! ఏం సభలెద్దురూ! వడ్లగింజలో బియ్యపుగింజ' అన్నారు కాంతమ్మగారు.

'అలా అనకు మరి. ఈ సభలన్నీ మన కేంద్రప్రభుత్వం ఆధ్వర్యమున జరుగుతాయి.'

'అవున్లెండి అయినా ఆ గొడవలన్నీ నాకు తెలియవు' అన్నారు కాంతమ్మగారు.

'ఇదంతా నీ అదృష్టం కాంతం.'

'ఇది చాల బాగుంది. సభకువెళ్ళేది మీరు. సన్మానాలు పొందేది మీరు. మధ్యనా అదృష్టం ఏమిటి' అన్నారు కాంతమ్మగారు నవ్వుతూ;

'నీకు చాలసార్లు చెప్పాను. మగవాని భవిష్యత్తుకు, ఆడదానికి చాలదగ్గర సంబంధం వున్నదని' అన్నారు రావుగారు. ఈమాటలు రావుగారు చాలసార్లు అనడం తను వినడం పరిపాటే. ఆమె నవ్వుకుంటూ ఇంట్లోకి వెళ్ళిపోయారు.

రావుగార్కి మొదటినుండి సాహిత్యమంటే మమకారం ఎక్కువ చిన్ననాటినుండి సాహిత్యాన్ని మథించి చాల కృషి చేశారు ఇంటర్‌మీడియట్‌లో తెలుగులో చక్కని మార్కులు వచ్చినందుకు, ఆంధ్ర విశ్వవిద్యాలయం బంగారు పతకంతో సన్మానించారు. యం. ఎ. పూర్తిచేసి స్థానిక కళాశాలలో తెలుగు ఉపన్యాసకులుగా చేరారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ, శక్తివంచన లేకుండా భాషాసేవ చేశారు. ఎన్నో గ్రంథాలు కావ్య విమర్శలు వ్రాసి పెద్దల ఆశీస్సులు పొందారు. సన్మానాలు ఎన్నో జరిగాయి.

ఈ వుత్తరం రావుగార్ని ఆనంద భూతుణ్ని చేసింది తన కర్తవ్యం తెలుసుకున్న రావుగారు ఉపన్యాసం తయారు చేసుకోవటాన్కి ఉపక్రమించారు.

అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడే ఃదేశాలకు విజ్ఞానాన్ని ప్రసాదించిన తనదేశం, భరతభూమి సకల కళలకు పుట్టినిల్లు. సత్యాహింసలు బోధించిన గాంధీ బుద్ధుల గన్నదీ తల్లి. సస్యశ్యామలమైన పాడి పంటలతో నిత్యకళ్యాణం పచ్చతోరణంగా అలరారింది. ధర్మసంస్థాపనార్థం ఎన్నో త్యాగాలు చేసిన షట్చక్రవర్తుల మాతృదేవి. సిగపువ్వువంటి కాశ్మీరము మొదలు ఉదధి ఉదకాలతో పునీతమయ్యే కన్యాకుమారివరకు వివిధ అందాలతో విలసిల్లే నిత్యసుమంగళి మనతల్లి. పరోపకార పరీణతకు కన్నకొడుకునే బలిపీఠానికి పంపిన కుంతీవంటి పతివ్రతల జన్మభూమి గంగా, గోదావరి నిత్యం ప్రవహించేది ఈ కర్మభూమిలోనే గోమాతకు పూజలందిస్తూ ప్రపంచానికి భూతదయను చాటిన ఆదర్శమూర్తి, సకల మత సమతాభావాన్ని సరిజూపి, సరిదిద్దిన సామరస్యమూర్తి, రాజ్య భారంతోపాటు సాహిత్య భారాన్నిమోసిన ఆంధ్ర భోజుడు, శిల్పకళను పోషించిన పల్లవ, చోళ చక్రవర్తులు, సంగీతానికి మెరుగులు దిద్దిన రఘునాథ రాయలు, చిత్ర కళకు పేరుగాంచిన అజంతా ఎల్లోరా గుహల నిర్మాతలు మొదలుగాగల మహామహులగన్న కళామతల్లి. అనంతమైన భారతీయ సంస్కృతీ వికాసాన్ని అడుగడుగునా వీక్షిస్తూ గత చరిత్రను పునరావలోకించుకుంటూ వుండిపోయారు రావుగారు

# రైలుప్రయాణం

పట్నం వెళ్లవలసిన రోజు దగ్గిర పడింది రావుగారు ప్రయాణ సన్నాహాలు ప్రారంభించారు ఎన్నోరాత్రులు శ్రమించి తయారుచేసిన తన ఉపన్యాసాన్ని చూసి రావుగారు తృప్తిగా ఊపిరి పీల్చుకున్నారు ప్రయాణానికి ముందురోజున కాలేజీలో అధ్యాపక వర్గం, విద్యార్థి బృందం ఘనంగా రావుగారికి వీడ్కోలు యిచ్చారు వారి ఆదరణకు ప్రోత్సాహనికి రావుగారు ముగ్ధుడయ్యాడు.

'మాష్టారు! మనకాలేజి పరువునిలపాలి మీ ఉపన్యాసం దేశ విదేశ ప్రతినిధుల చెవుల్లో మారుమ్రోగాలి మనదేశ సంస్కృతి వారికి హృద్యమంగా వినిపించాలి' అన్న విద్యార్థి నాయకుని ఆశావేశాలు రావుగారిలో దృఢ దీక్షను స్థిర పరచగా గంభీరంగా బండిలో ప్రవేశించారు మరునాటి సాయంత్రం రావుగారు.

బండి నెమ్మదిగా నడక సాగించింది. దూరమవుతున్న ఆప్తుల్నిచూస్తూ రావుగారు కొన్ని సెకన్లు ద్వారం దగ్గిర నిలబడి పోయారు. బండివేగం అందుకున్నది పొగతోబాటు వచ్చిన కొన్ని బొగ్గకణములు రావుగారి కంట్లో పడ్డాయి కళ్లు నులుముకుంటూ వెళ్లి తన స్థానంలో కూర్చున్నారు రావుగారు. ఎల్లుండి పట్నంలో తన ఉపన్యాసం. ఉపన్యాస ప్రతిని చేతికి తీసికొన్నారు. నెమ్మదిగా చదవటం ప్రారంభించారు ప్రతి విషయాన్ని విమర్శనా దృష్టితో చూస్తూ పరిశీలించ సాగారు బ్రహ్మాండమైన ఉపన్యాస వేదిక, దేశ విదేశ ప్రతినిధులు ఆశ్చర్యంతో ఆనందంతో తమ హర్షాన్ని వెలిబుచ్చుతూ రావుగారి ఉపన్యాసాన్ని వింటున్నారు పత్రికా విలేఖరులు అనర్గళ వాక్ ధోరణికి అబ్బురపడుతూ విషయాన్ని చకచకా వ్రాసుకుపోతూ వున్నారు. కెమోరాలు క్లిక్‌మన్నాయి ఉపన్యాసం అనంతరం ఎందరో తనను అభినందించడం జరిగింది సంస్కృతిని కండ్లకు కట్టినట్లు చిత్రించిన నీజన్మ సార్థకం, అన్నారు పెద్దలు రావుగారు తన కృషి ఫలించిందని మనస్ఫూర్తిగా తృప్తిపడ్డారు బండి కుదుపుతో ఆగడం, రావుగారు ఊహాలోకం నుండి బయట పడటం ఒక్కసారి జరిగాయి

బండి ఏదోస్టేషన్లో ఆగింది ఇద్దరు వ్యక్తులు బండిలో ప్రవేశించారు రావుగారు తన బర్తుపైకి వెళ్లి విశ్రాంతి తీసికో సాగారు

'మరి మంత్రిగార్ని చూశారా? రామయ్యగారు' అన్నాడు ఆ యిద్దరిలో ఒకరు


'వెళ్లింది వారికోసమేగా కోటయ్యగారు' అన్నాడు రామయ్య

'విశేషం ఉన్నదన్నమాట' అన్నాడు కోటయ్య అదో మాదిరిగా

'ఆ! ఏం విశేషం లెద్దురూ మామరదలుంది చూశారు ఆవిడ భర్త చిన్న తనంలోనే మరణించడం జరిగింది అప్పటి నుండి ఆమె బాధ్యత, ఆమె కుమారుని బాధ్యత నానెత్తిన పడింది అనకూడదుగాని పిల్లవాడు బుద్ధిలో బృహస్పతి నెమ్మదిగా బి ఎ దాక చెప్పించాం ఏదో మంత్రిగారి పుణ్యమా అని ఒక చిన్న ఉద్యోగం కూడా వేయించాం'

'అయితే కోటలో పాగా వేశారన్నమాట' అన్నాడు కోటయ్య

'వేసినట్టే వుంది మొన్నీ మధ్యనే టెలిగ్రాం లాంటి వుత్తరం వ్రాశాడు.'



'ఏదైనా ప్రమోషన్ సంగతా?'

'అయ్యోరామ! అసలు మొదటికే మోసమండీ'

'అంటే ఏమైనా.' అన్నారు కోటయ్య పాలోచనగా

'అబ్బెబ్బే మావాడికి అవేం లేవండీ' అన్నాడు రామయ్య అర్థం లేని కంగారుతో

'మరి అంత అర్జంటు పుత్తరం ఏమిటి?'

'ఏముంది కోటయ్యగారు ఈ పది పర్సెంటు కట్‌లో మావాడికి తప్పేట్లు లేదు' అన్నాడు రామయ్య.

'ఇతగాడు జూనియరా?'

'అందుకే కదండీ మంత్రిగారిని. .'

ఈ సంభాషణ రావుగారి మనస్సులో రకరకాల ఆలోచనలు రేపింది ఒక్కసారిగా ఆయన ముఖం బొమ్మ ముడిపడింది అయినా వారి సంభాషణ ఆగలేదు

'మరి మీ అబ్బాయి చదువు పూర్త యిందా? కోటయ్యగారు' అన్నాడు రామయ్య

'మొన్ననే బి ఎ. పరీక్ష వ్రాశాడు' అన్నాడు కోటయ్య,

'అదంతా విశాఖపట్నంలో వ్యవహారంగా' అన్నాడు రామయ్య.

'అదేమీ లేదనుకోండి. రాజధానిలో మావాడికేదో మనువుందంటే చూదామని వెళ్లివస్తున్నా' అన్నాడు కోటయ్య తప్పించే ధోరణిలో.

# రైలుప్రయాణం

కోటయ్య చెప్పింది పూర్తిగా అబద్ధమన్న సంగతి రామయ్యకు బాగా తెలుసు. పై పెచ్చు సంగతికూడా పూర్తిగా తెలుసు తను గోప్యంగావుండి ఎదుటివారిని అల్లరి పెట్టే స్వభావం కోటయ్యది రాజధాని ప్రయాణమర్మమేమిటో బయటపెట్టే టట్టు ఒక్క చురక అంటించి మాస్తాను, అనుకున్నారు రామయ్య తనలో.

'ఏం పరీక్షలు, ఏం చదువులెండి రానురాను క్రమశిక్షణకూడా లోపించిపోతూ వున్నది కాకుంటే ఏమిటండీ కాలేజీ ప్రిన్సిపాల్‌ని విద్యార్థికొట్టడం అంటే పశుత్వంకాక' అన్నాడు రామయ్య

'ఏమిటేమిటి' అన్నాడు కోటయ్య తెల్లబడ్డ ముఖానికి రంగులు పులుముకుంటూ ఏమి ఎరగనట్లు.

'ఏముంది పలుకుబడండీ పలుకుబడి' అంటూ రామయ్య చిలువలు పలువలు కల్పించి చెప్పాడు. పాపం కోటయ్య పరిస్థితి వర్ణనాతీతం.

ఈ ప్రత్యేక సంభాషణ ఎవ్వరికోసం ఊహించలేని అమాయకుడుకాదు కోటయ్య అయినా యిదంతా తనకు సంబంధించనిది అన్నట్లుగా నటించడం తన విధిగా గుర్తించాడు కోటయ్య

'ఎందుకు కొట్టారుట' అన్నాడు కోటయ్య సాధ్యమైనంతవరకు అమాయకత నటిస్తూ

'చదివి ఛస్తేగా మార్కులు రావటాన్కి. అవి రానూలేదు. పరీక్షకు పంపలేదు' అన్నాడు వెటకారంగా రామయ్య


కోటయ్య మ్రింగలేని, క్రక్కలేని స్థితిలో నిప్పులాంటి నిజాన్ని వినలేక పడక సంభాషణ త్రుంచివేసే ధోరణిలో.

'నిజమేననుకోండి' అన్నాడు

కోటయ్య మానసికస్థితిని అర్థంచేసుకొని, కసితీరని రామయ్య 'ఉత్తి నిజమేననుకోండి అని నాన్చేస్తారేమిటి కుర్రవాణ్ణి పోలీసులు పట్టుకెళ్లారా? జైల్లో పెట్టారా? పొద్దుపొడిచేసరికి ఆ ఫోకిరీ వెధవ విడుదలవటం, ఇన్‌స్పెక్టరుగారు బదిలీ అవడం ఒకేసారి జరిగాయి. పలుకుబడి అంటే చదువు చెప్పే వాళ్లమీదే కాదండీ! న్యాయాన్ని పాలించే పోలీసుల మీదకూడ ప్రయోగించాలి? అప్పుడే కదండీ మనలాంటివాళ్లంటే తెలిసివచ్చేది' అన్నాడు మనలాంటిదగ్గర వత్తి పలుకుతూ రామయ్య 'పాపం రామయ్య ఆక్షణంలో తన పలుకుబడి సంగతి మరచిపోయాడు. రూపాయిలాంటి కోటయ్య ముఖం నయా పైసంతయ్యి ముడుచుకుపోయింది

కోటయ్య మరి మాట్లాడకుండా నిద్ర కుపక్రమించాడు రామయ్య నిండుగా నవ్వుకున్నాడు.

కాలగమనం రంగులరాట్నం లాంటిది. రైలు తన గమనాన్ని సాగిస్తోంది ఒక పెద్ద జంక్షన్‌వద్ద ఆగింది రావుగారు బండిదిగి కాంటీన్‌వద్దకువెళ్లి, టీ త్రాగుతూ నిలబడివున్నారు ఎదురుగా కంపార్టుమెంటులో సుఖంగా కూర్చుని నిద్రపోతూవున్న రామయ్య కోటయ్య కన్పిస్తున్నారు పలుకుబడి పేరుతో పరిసరాలను పాప పంకిలంచేసి అణుమాత్రం కూడా పాప చింతన లేకుండా ప్రశాంతంగా జోగుతున్న రామయ్య, కోటయ్యలను చూడగానే రావుగారిక్కి ఎంతో జుగుప్స కలిగింది. మరచిపోదామన్నా, మరపున పడక కలకలిస్తుంది వారి సంభాషణ. జీవితాన్నే వెచ్చించి అపురూపంగా నిర్మించుకున్న అందాల సౌధం భూకంపానికి కూలినట్లయింది చల్లనితల్లి గోదావరి ఒక్కసారిగా కట్టలు త్రెంచుకుని, బీభత్సంగా వరద లెత్తినట్లయింది. ప్రశాంతంగా సాగే నావ నడిసముద్రంలో భీకర తుపానులో చిక్కు



కున్నట్లయింది కకావికలమైన మనస్సుతో రావుగారు, తన బర్తుపైకి చేరారు ఓ యువతి తటాలున బండిలో ప్రవేశించింది ఆత్రుతగా చుట్టూ కలయజూసింది విపరీతంగా దుఃఖించటంవల్ల కాబోలు కళ్ళు ఎర్రబారి వున్నాయి కళ్ళల్లోని కంగారు, మనస్సులోని ఆందోళనకు ప్రతిబింబంగా నిలిచింది. రేగిన కురులు, మాసినచీర, ఆమె అందానికి నవ్యనాగరికతకు కళంకంగా వున్నాయి. ఆత్రుతగా ద్వారంవైపు చూస్తూ కూర్చుంది బండి బయలుదేరుతుండగా ఒక యువకుడు, నిస్త్రాణగా పెట్టెలో ప్రవేశించాడు యువతీయువకులు జీవంలేని చిరునవ్వు చెరిసగం పంచుకున్నారు ఆ యువతి కొంచెం జరిగి అతనికి చోటు ఇచ్చింది. ప్రమేయం లేకుండగనే రావుగారి దృష్టి వీరిపై మళ్ళింది ఏవో ఆలోచనలు మనస్సులో చోటు చేసుకోబోయాయిగాని, ప్రయత్నపూర్వకంగా రావుగారు సంబాళించుకున్నారు

'ఏమిటంత కంగారుగా ఉత్తరం వ్రాశావు' అన్నాడు యువకుడు రహస్యంగా

'ఏం చెయ్యమంటావు హరి' అన్నదా యువతి నిస్పృహయంగా

'విషయం ఏమిటో వ్రాయకుండా ప్రాణంమీదకు వచ్చిందంటూ ఉరుములేని పిడుగులాగ ఆ వుత్తరం ఏమిటి గుండె పగిలి చావమనా? ఇంతకీ ఏమయింది మన గుట్టు బయటపడిందా?' అన్నాడు హరి

'దాదాపుగా' అన్నది

'నా ఉత్తరాలు నీభర్త చూశాడా?'

'లేదు కాని ఈమధ్య కొన్ని భయంకర సత్యాలు గమనించాను'

'ఏ విషయంలో'

'నా భర్త విషయంలో.'

'ఏమిటది'

'నాతో కొన్ని దినాలుగా ఆయన సరిగ్గా వుంటం లేదు'

'ఎందుకు?'

'అదే అర్థంకాలేదు'

'మరి నీకు భయందేనికి?'

'భయం కాక మరేమిటే, నీ రూపం నాలో పెరుగుతూ వుంటే' అతని ముఖం వింత కాంతితో వెలిగింది. పట్టరాని ఆనందంతో—


## సైకి లెక్కే వారికి చాల ఇష్టమైనవి

# మిల్లర్® సైకిల్ డైనమో లైటింగ్ సెట్లు

మిల్లర్ సైకిల్ డైనమో లైటింగ్ సెట్లు
25 మీటర్ల (30 గజాల) పైబడి ముందుకు ఏకరీతిని ప్రకాశవంతమైన వెలుగునిస్తాయి ఉన్నతమైన పాటవానికి, నమ్మకమైన సర్వీసుకు ఎల్లప్పుడూ మిల్లర్ సైకిల్ డైనమో లైటింగ్ సెట్లను పేరుచెప్పి కోరుకొనండి,
మిల్లర్ లాంప్‌తో మీరు సదా సరైన దారినే ఉంటారు.

95 సంవత్సరాల పైబడి పేరుపొందిన హెచ్ మిల్లర్ అండ్ కంపెనీ లిమిటెడ్, బర్మింగ్‌హాం ఇంగ్లండు వారితో సహకృఎని తయారు చెయ్యబడినవి

MILLER®

టిఐ మిల్లర్ లిమిటెడ్, మద్రాసు-1 వర్క్స్: అంబత్తూరు, మద్రాసు-53.)
®హెచ్ మిల్లర్ అండ్ కంపెనీ లిమిటెడ్ ఇంగ్లండువారి రిజిస్టర్డు ట్రేడ్‌మార్కు. ఇండియాలో తయారుచేసేనవారు టిఐ మిల్లర్ లిమిటెడ్ మద్రాసు.1 రిజిస్టర్డు వాడకందార్లు

ఒక Ⓣ ఉపసంస్థ



FDS TIM 907 TE

**1968 లో మీ అదృష్టము**

మీరు ఒక పోస్టు కార్డుమీద ఏదో పుష్పము పేరునైనా వ్రాసి, మీ అడ్రసు తెలుపండి. మేము మీకు రాబోవు సంవత్సరములో జరుగు



ముఖ్య సంఘటనలు, అనగా వ్యాపారంలో లాభనష్టాలు, నౌకరీలో ప్రమోషన్ & ట్రాన్స్‌ఫర్లు, పిల్లల జననం, వివాహం, సుఖసంతోషాలు మరియు చెడు నక్షత్రాలకు శాంతి చేసుకొను విధానములు రు. 1-25 కే పంపెదము. పోస్టేజీ అదనం. ఒకసారి మా చిన్నతృప్తి చెందగలరు.

**PT. DEV DUTT SHASTRI**
Raj Jyotshi, (MAP) P. B. 86,
JULLUNDUR CITY.

**SPECIAL TREATMENT**
Licenced under M. & T. P.
Act — Rule (83)

వీర్యస్తంభనము :- నరాల బలహీనత పోయి మంచిశక్తి కల్గుటకు పైకి మర్దనకు తైలం 1 సీసా రూ. 27/-. పైకం ముందుగా పంపాలి.

**డా. రత్నం సన్స్.** (Estd 1904)
అజంపురా రైల్వే వంతెన వద్ద,
New Malakpet,
హైదరాబాద్ — 36 ఆం. ప్ర.

**ఋణములు పొందండి**

రు. 500 నుండి రు. 12000 వరకు స్వంతపూచీమీద—వివాహము, వ్యాపారము, గృహము, కారు, మోటర్, వగైరాలకు - 60 వాయిదాలలో తేలికగా చెల్లించవచ్చు. ఇంగ్లీషు లేక హిందీలో ఉచిత ప్రాస్పెక్టస్‌కు వ్రాయండి.

Kuber Finance (P) Ltd.,
(WAP) Seetla, Amritsar.

**వాయిదాల చెల్లింపుపై ట్రాన్సిస్టర్**




నెలకు రు. 10/- వంతున సులభముగా చెల్లించి రు. 320 వెలగల 'పార్కర్ క్వీన్' పోర్టబుల్ 3 బ్యాండ్స్, ఆల్ వరల్డ్ పోర్టబుల్ ట్రాన్సిస్టర్లు పొందండి. వివరములకు :

ATLAS CO., (APW-M22)
Box No. 1329, Delhi-6.

# రైలుప్రయాణం

'లీ, ఇన్నాళ్లకు మన ప్రేమ సార్థకమయింది'.

'అయ్యో! నీకు ఎలా తెలియ చెప్పాలి' అన్నది లీల అంత నిరుత్సాహంగా.

'అంటే'

'నీ రూపానికి వెలుగు నియ్యడం నేను పతితగా ఋజువు పరచుకోవడమే'

'సరిగ్గా చెప్పాలీల'

'సరే విను. ఆయన ఈ మధ్యనే ఆపరేషన్ చేయించుకున్నారు' మధ్యలో అందుకుని 'ఫెయిల్ అయివుండొచ్చుగా'

'ఆ ఋజువులన్ని అయ్యాయి. ఆపరేషన్ సక్సెస్. అందుకే వ్యథ.'

'అయితే ఏం చేద్దాం' అన్నాడు జాలిగా.

'నన్ను సలహా అడగటానికి నీకు సిగ్గు లేదూ?'

'మరి ఏం చెయ్యమంటావు?'

'హరీ నీవు ఒట్టి గాలివాటం మనిషివేనా? నా బాధ నీకెలా అర్థమవుతుంది.'

'నీ దృష్టిలో నేనంటే ఇంతేనా లీలా. ఆనాడే నన్ను పెళ్లి చేసుకుని వుంటే, ఈ సమస్య వుండేదికాదు కదా' అన్నాడు హరి లాలనగా.

'గతాన్ని త్రవ్వకుంటే ఒరిగేది' అన్నది లీల విసుగ్గా. హరి మౌనం వహించాడు.

'ఇంతకీ నా చేతుల్లో ఏ ముందనేగా నీ మౌనం' అన్నది లీల. తిరిగి మౌనం తప్ప లేదు హరికి.

'అంతే, అంతే హరి, ఆదిలోనే నా సర్వస్వాన్ని హరించావు. అగ్ని సాక్షిగా వివాహమాడిన భర్తకు నిన్ను నమ్మి అన్యాయం చేశాను. ఇంత అభానుపాలై నిన్ను ఆశ్రయిస్తే, ఇదా నువ్వు చూపే ఆదరణ. మొదట నుండి నన్ను మోసగించటమే నీ వృత్తిగా పెట్టుకున్నావు. నిద్రాణమై వున్న నా స్త్రీత్వాన్ని మేలుకొల్పి బానిసగా చేసికొన్నావు. తండ్రిని ఉసికొల్పి కట్నం పేరుతో నన్ను పెండ్లిచేసుకోవడం తప్పించుకున్నావు. అయినా నిన్నే నమ్ముకున్నాను. నీవు వట్టి పిరికివాడివని ఇప్పటికి తెలిసికోవడం దౌర్భాగ్యం'

'నీవిలా ఆవేశపడటం బాగా లేదు. నన్నేం చేయమంటావు?'

లీలకు సహనం చచ్చిపోయింది.

'చూడు హరీ'

'ఏమిటి లీలా'

'ఏమీలేదు. ఈ ప్రక్క స్టేషన్‌లో నీవు దిగిపో, నన్నెప్పుడూ గుర్తుతెచ్చుకోకు. జరిగినది ఒక పీడకల అనుకో, నేనుచేసిన పాపం నేనే అనుభవిస్తాను.'

'అదికాదు లీలా'

'ఏదికాదు. నీవింక మాట్లాడవద్దు. ఏమైనా మాట్లాడావా దూకి ఛస్తాను' అన్నది లీల నిశ్చయంగా. హరి కలవరపడ్డాడు. లీల శత మొండియని అతనికి బాగా తెలుసు. కాని ఏంచెయ్యాలో బోధపడక నిరుత్తరుడై ఆమెవైపు చూశాడు అంతలో బండి ఒక స్టేషన్‌లో ఆగింది. దిగి పొమ్మన్నట్లుగా సౌంజ్ఞచేసింది లీల అతడికి. బాధపడుతున్నట్లుగా నటిస్తూ బండి దిగిపోయాడు. లీల నిర్లిప్తంగా నవ్వుకుంది. మరోమార్గాన ఆమెకూడా బండి దిగి చీకటిలో కలసిపోయింది.

కన్యాత్వం విలువలేనిదా? పాతివ్రత్యం మట్టి కొట్టుకుపోయిందా? పవిత్రశీలం ఆటవస్తువులా అమ్ముడుపోయే స్థితి వచ్చిందా? ఏమిటీ వైపరీత్యం. మనిషి, మమతా, మనస్సు, అర్థంలేని వ్యర్థపదాలా? కర్మభూమి భరతదేశంలో ఈ నైతికపతనం ఎట్లా సంభవించింది? భగవాన్. ఈ సృష్టినీది. దీన్ని రక్షించే భారంకూడా నీదికాదా? నా అసలు, నమ్మకాలు ఎండమావుల్లా మారుతున్నాయి. నిశ్శబ్దంగా రోదించారు రావుగారు.

'హరిఓం నారాయణ' అంటూ సాక్షాత్తు వేంకటేశ్వరస్వామిని మరపిస్తూ శిష్య పరమాణువులతో బండిని పావనం చేశారు ఒక హరిదాసుగారు. రావుగారికి ఎడారిలో ఒయాసిస్సు దొరికి నట్లయింది. ప్రసన్న వదనంతో హరిదాసుగారికి మనస్సులోనే అంజలి ఘటించారు. హరిదాసుగారు పరమాణులు పరువుల పెట్టెలో ఆశీనులయ్యారు.

'చిన్నయ్యా, భక్తి, తత్పరత అంటే ఆంధ్రులదేనయ్యా! ఏం జనం ఏం భక్తి ఇసుకవేస్తే రాలిందంటావా?'

'చిత్తం చిత్తం' అన్నారు చిన్నయుస్వామి.

'ఒక భక్తేకాదు. కానుకలు ఇవ్వడంలోనూ వారిదే పైచెయ్యి' అన్నారు దాసుగారు.

'కాకుంటే హారతి పళ్లెంలో మనం మాటపదహార్లు ఏవాడైనా చూశావా?

అన్నారు చిన్నయస్వామి.

'ఏది హుండీమాట చెప్పవేం' అన్నారు మంగస్వామి రహీమ్.

'ఎంపము స్థాయిలో పలికించయ్యా' అన్నారు ఫిడేలుస్వామి జార్జి.

'మన కాలక్షేపం ఒకఎత్తు, కనకవల్లి నాట్యం ఒక్కటే ఒకఎత్తు'

అన్నారు దాసుగారు కనకవల్లిని కటాక్షిస్తూ.

'అసలు ఆకర్షణ అదేకదా స్వామి' అన్నాడు చిన్నయ్య, దాసుగార్కి నివేదనగా. కనకవల్లి మొహం విప్పారింది.

'మరి బాలాజీ కల్యాణం దగ్గరలోనే నిర్ణయించాలి స్వామి' అంది కనకవల్లి.

'మరి తాపత్రయం దానికేగా హుండీలు మరీ చిన్నవి ఏదో పెద్ద హుండీ అయితే, నీ యిష్టం' అన్నారు దాసుగారు.

రావుగారికి ఇదంతా అగమ్యగోచరంగా వున్నది.

'ఏమిటి ఇదంతా' అన్నాడు జార్జి.

'ఇది పెద్ద పరమార్థం జార్జి నీకు తెలీదు మనస్వామివారికి, స్వామి సాక్షాత్కరింపి చిన్న చిన్న హుండీలు మనస్వామిని కైంకర్యంచెయ్యా—పెద్ద కట్నాలు శ్రీవారికి నివేదించమని సెలవిచ్చారు' అన్నాడు చిన్నయ్య. రావుగారే కాకుండా, జార్జి ఉలిక్కిపడ్డాడు.

'జార్జికి పతనం అనుభవం రాలేద'న్నారు దాసుగారు. జార్జి బిక్కమొహం వేసి, కనకవల్లి సహితంవెంట ప్రక్క భాగంలోనికి వెళ్లారు.

ఏకాంతంలో వుండిపోయారు దాసుగారు, చిన్నయ్య. రావుగారు నిద్రిస్తూ వున్నట్లుగా మొదటినుండి లెక్కించారు. చిన్నయ్యను సరాసరి పిలిచి 'మరి — వచ్చే ఉప్పుడు మన లక్ష్మాయి షేదారుని' అన్నారు దాసుగారు కార్యక్రమం ప్రారంభిస్తూ.

'చిత్తం కాసీ'

'ఏం జరిగింది?'

'ప్రత్యేకంగా ఏమీలేదు ఇదివరకు మాదిరే'

'అంటే సన్మానంలోనూ, చివరకు కనకాభిషేకంలోనూ'

'సగభాగం తప్పలేదు స్వామి.'

'నీవు నచ్చచెప్పలేదూ?'

'ఊరుకుంటానా స్వామీ? ఇదిపూర్తిగా ఆనాటకు నాస్తికంచెప్పే వ్యాపారం అన్నారా ఏదో, మీమీదగల భక్తి తాలూకా చివరకు పంచమస్వామి చేరుకున్నాడు'

'మరీ అంతతక్కువా'

'చిత్తం మీ కనకాభిషేకానికి, సన్మానానికి, తిరగడానికి వగైరా ఖర్చులు'

'మనవి కాదనేగా ముందు ఒప్పందం'

'కాబట్టే ఆ స్వామి అన్నాడు' చిన్నయ్య. దాసుగారు కొన్ని నిమిషాలు మౌనం వహించారు. చిన్నయ్య చెప్పినమాట ఆషాఢభూతిలాగా ఏదో నమ్మనట్టు కన్నట్టు ఆయన కళ్లల్లోకి చూస్తూ వుండిపోయాడు.

'మళ్లీ ప్రయత్నమయినా లావణ సంహారం జరగాలి ఇదంతా మీకోసమే' అన్నారు దాసుగారు ఆవలిస్తూ.

'చిత్తం, చిత్తం, తమరు విశ్రాంతి' అంటూ కనకవల్లిని పిలిచి తను నిష్క్రమించాడు.

భగవంతుని దివ్యలీలను గానం చెయ్యటానికి, హరికథలు సృష్టించబడ్డాయి. మతవిజ్ఞానం ప్రచారం అయ్యే ఏర్పాట్లు భాగవతులు స్వయంపాకులు కాని ఆ దాసులు మరి ఆలోచించలేక నిద్ర కుపక్రమించారు రావుగారు.

భళ్లున తెల్లవారింది. కండ్లు తెరచి చూసేటప్పటికి బండి ఏదో స్టేషన్లో అప్పుడే ఆగుతోంది. రామయ్య, కోటయ్య ఎప్పుడు దిగిపోయారోగాని, దాసుగారు వారి పరివారంవులు దిగటానికి సిద్ధపడుతున్నారు. ఎల్లె గ్రామస్తులు బాజాలు దాసుగార్కి మేళతాళాలతో ఘనంగా స్వాగతం యిస్తున్నారు.

దాసుగారు దిగేంతవరకూ, రావుగారు ఒకట్టే చూస్తూ, వారు వెళ్లిన తరువాత రావు దిగి కాలకృత్యాలు తీర్చుకొని క్రిందకు వెళ్లి కాఫీ త్రాగి తిరిగి పెట్టెలోనికి ప్రవేశించారు. పెట్టంతా నిర్మానుష్యంగా వుంది. ప్లాట్ ఫారం మీద మామూలు రణగొణ ధ్వని తప్ప మరేమీ లేదు. ఒంటరి ప్రయాణం రావుగార్కి ఏమో అనిపించింది. మనస్సులో ఏదో దిగులు ప్రవేశించింది. చిరాకుగా చేతి గడియారం చూసుకున్నారు. పట్నం చేరాలంటే ఇంకా



# రైలుప్రయాణం

రెండు గంటలు గడవాలి ఏకాంతం, రావు గార్కి తను బయలుదేరిన దగ్గరనుండి జరిగిన సంఘటనలు పునశ్చరణ చేసుకోవ డాన్కి అవకాశం యిచ్చింది ముఖ్యంగా రాత్రి తను చూసిన వ్యక్తులు, వారి చరిత్రలు మనస్సులో మెదలసాగాయి దృష్టిని మరోవైపు మళ్లించడాన్కి ప్రయత్నించి రావుగార్కి తన ఉపన్యాస ప్రతి కన్పించింది అది తన్ని వెక్కిరిస్తున్నట్లుగా తోచింది తను ఎంతగానో ఊహించిన సంస్కృతి ఈనాటిది కదేమో అనిపించింది తన జీవితానుభవం చాలదు తను ఎంతో వెనకబడ్డట్లు ఆయన బాధపడ్డారు తనవారికి ఏమని చెప్పాలి ? న్యాయానికి, ధర్మానికి గొడ్డలిపెట్టు ఒడిందని, నైతికత కూకటివేళ్లతో పెళ్లగించబడిందని — భగవచ్ఛక్తికి మంగళం పాడబడిందని తను ఎలా చెప్పగలడు? నవ్య నాగరికత పేరుతో జరిగే నైచ్యం దేశాన్ని ఎంత నీచానికి అణగ్గదొక్కిందో వివరించేదెలా ? ఏది నాగరికత ? ఏది సంస్కృతి ? ఆడంబర జీవితమేనా నాగరికత ? ఉచ్చ నీచాలు పాటించని చరిత్రహీనుల జీవితాలు సంస్కృతి ప్రతిబింబాలా ? కాదు ఎప్పటికీ కాజాలదు కాకూడదు వీటన్నిటికి అతీతమై అన్యాక్తాన్నిచ్చేది సంస్కృతి వినా నమే నవ్యంగా తన కనుభవనీయమైనదే సంస్కృతని భావించటం ఆత్మ వంచన కాదా ? అయితే ఒకనాడు సగర్వంగా చాటి చెప్పుకొన్న భారతీయ సంస్కృతి ఈనాటికి మచ్చుకైనా లేదా ? ఏమిటిది ? ఏమిటిది ?

ఎక్కడిదీ కాంతికిరణం కారు చీకట్లు కమ్ముకున్న తన మనోదృష్టికి ఏ మార్గం చూపటాన్కి ఈ కాంతికిరణం ? దూరాన్ని వెలుగు కనబడీ కనబడనట్లుంది మసక మసకగా కన్పిస్తోంది. ఆ కాంతిలో ఏదో అస్తవ్యస్తంగా కన్పిస్తోంది ఏవరివారూపాలు? పూజ్య బాపూజీ, నిర్మలమూర్తి జీసస్ మనుష్యుల అమానుషతకు ఆహుతైపోయిన పుణ్య జీవులు. సోదర మానవత్వాన్ని, నిర్మల నైతికజీవితాన్ని ఆదర్శప్రాయంగా బోధించిన మహానుభావులు అహంభావుల మధ్య, దురధికారుల మధ్య ఉద్భవించి తమ జీవితాలను తృణప్రాయంగా నెంచి జగతికి వెలుగు చూపిన త్యాగధనులు నాడే కారు-నేటికి వున్న దీ త్యాగ ధన్యత త్యాగ ధనం ఎన్నటికీ విలువ లేనిది కాదు ఆది నశించదు మానసిక ఔన్నత్యం కూడా అంతె హాలాహలము, అమృతము ఒక్కచోటనే వుద్భవించాయి. పరివేష్టించి వున్న హాలాహలాన్ని విడదీసి అమృతాన్ని పంచగలిగారు కార్యదీక్షా దక్షులు అలాంటిదే నేటి పరిస్థితికూడా. యుగానికో ధర్మమయిన మంచితనమే దాని ప్రాతిపదిక ఆ మంచిని రక్షించడమే మానవత్వం పంకిలానికి భయపడి పద్మాన్ని విడనాడటం ఔచిత్యం కానేరదు జ్వాజ్వల్యమానంగా ప్రకాశించే కాలగమనంలో కరడుగట్టి మినుకు మినుకుమనే మన సంస్కృతిని పునర్జీవింపచేయాలి — భారతీయునిగా తన కనీస కర్తవ్యం

స్థిరనిశ్చయానికి వచ్చిన రావుగారు నిండుగా శ్వాస తీసుకున్నారు రావుగారు తిరిగి తన చేతిగడియారం చూసుకున్నారు. ఇంక పదినిమిషాల్లో బండి పట్నం చేరుతుంది పట్నం చేరిన తరువాత దేశకాల పరిస్థితుల కనుగుణ్యంగా తన ప్రతిని కొంచెం సంస్కరించి ఉపన్యసించడం తన విధి నెమ్మదిగా బండి స్టేషన్‌లో ఆగింది. స్వాగతం పలుకుతూ వాలంటీర్లు నూతన దృక్పధంతో చిరునవ్వులు చిందించే రావుగార్ని తోడ్కొనిపోయారు. ●


కే టి కృష్ణమూర్తి ఆచారిగారి



"మేల్ మాయిల్ మందు"

నల్లరంగు ఎర్రరంగు పొడలు, దద్దులు, గజ్జి, మరియు వెడనీరు వ్యాపించినందన నేర్పడు వినుగు పుట్టించు రణములు మొదలగు

దీర్ఘకాల చర్మరోగములకు ఉత్తమ నివారిణి

వివరములకు

సిద్ధ డాక్టర్ కే టి. కృష్ణమూర్తి ఆచారి & సన్సు

5/22, మేల్‌మాయిల్, (P O) N A Dt



మీ అందమైన శిరోజములకు పోషణ మరియు పుష్టి అవసరము

బెంగాల్ కెమికల్స్



కాంతర్‌డైన్ హెర్ ఆయిల్

నిడుపాటి నిగనిగలాడే, మృదువైన కేశములు పెరుగుటకు సహాయపడును. ముతికి చేరనీయదు. రాలిపోవడం నిల్పును.

బెంగాల్ కెమికల్

కలకత్తా * బొంబాయి

కాన్పూరు * ఢిల్లీ